క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకుని వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రిను ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకెళ్లారు. అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న శ్రీ మోగదారమ్మ మహాలక్ష్మి

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ సమీపంలోని శ్రీమొగదారమ్మ మహాలక్ష్మి పద్మాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీలక్ష్మీ హోమం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

గ్యాస్ వినియోగదారులకు తాటితూరులోనే కేవైసీ నిర్వహించాలి

తగరపువలస: హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులకు భీమిలి మండలం తాటితూరు పంచాయతీలోనే కేవైసీ నిర్వహించాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు. గతంలో ఇక్కడ కేవైసీ నిర్వహించినా స్థానికులు అందుబాటులో లేనందున పూర్తిగా జరగలేదన్నారు. వినియోగదారుల్లో ఎక్కువ శాతం మహిళలు, వృద్ధులు ఉన్నందున రెండు ఆటోలు మారి తాటితూరు నుంచి భీమిలి రావడానికి వ్యయ ప్రయాసలతో కూడుకున్న పనవుతుందన్నారు. అందువల్ల ముందుగా సమాచారం అందించి తాటితూరులోనే కేవైసీ జరిపించేలా హెచ్‌పీ గ్యాస్ డీలర్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: చిట్టివలస రూరల్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33/కేవీ తాళ్లవలస సబ్‌స్టేషన్‌లో నిర్వహణ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విశాఖ ఆపరేషన్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు గొల్లల తాళ్లవలస, కొంగరాని కళ్లాలు, యాతపేట, తిరుమల విద్యాసంస్థల రోడ్డు, చిన్నిపేట, ఎస్‌ఆర్‌ఐ ఆస్పత్రి డబుల్ రోడ్డు, వలందపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఏపీ పీజీ సెట్‌లో ఏవీఎన్ విద్యార్థి ప్రతిభ



దాసరి కార్తికేయ

అల్లిపురం : ఏపీ పీజీ సెట్‌లో మిసెస్ ఏవీఎన్ కళాశాలలో చదువుతున్న బీఎస్సీ విద్యార్థి దాసరి కార్తికేయ గణాంక శాస్త్రంలో రాష్ట్రంలో 18వ ర్యాంకర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు విద్యార్థిని అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, అకడమిక్ డీన్ జి. శంకర్‌నారాయణరావు, గణాంక శాస్త్ర హెచ్‌వోడీ గాంధీ ఇతర అధ్యాపకులు, విద్యార్థులు కార్తికేయ కు అభినందనలు తెలిపారు.

మలేరియా రాకుండా జాగ్రత్తలు అవసరం



స్థానికులకు అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రశాంతి



రేవళ్లపాలెంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీతారాం

మధురవాడ: మలేరియా రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని పలువురు అధికారులు సూచించారు. 6, 7 వార్డుల్లోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం జీవీఎంసీ, పీహెచ్‌సీ సిబ్బంది డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మలేరియా, డెంగీ జ్వరాలు రాకుండా తీసుకోవల్సి జాగ్రత్తల గురించి వివరించి అవగాహన కల్పించారు. రేవళ్ల పాలెం శ్రీనివాస్ స్కూల్‌లో జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీతారాం, మలేరియా సూపర్‌వైజర్ బేబి రాణి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇతర ప్రాంతాల్లో మధురవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రశాంతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మంగళ, శుక్రవారాల్లో సిబ్బంది ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. నివాస ప్రాంతాల్లో ఉండే పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, టైర్, నీళ్ల కుండీల్లో లార్వాలు అభివృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా లార్వాలు కనిపిస్తే నీరు పారబోసి ఎండలో ఆరబెట్టాలని సూచించా ఇంటి బయట డ్రైనేజీ వ్యవస్థ, పాత పైప్‌లైన్‌లు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో డీ సిల్టింగ్ పనులు జరిగేలా చూసుకోవాలన్నారు. ఎక్కడ ఇబ్బందులు ఉన్నా ఏఎస్‌ఎం వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్‌లో నమోదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ వీర బ్రహ్మం పాల్గొన్నారు.

భీమిలి మెయిన్ రోడ్డు విస్తరణపై ఆరా



రోడ్డు విస్తరణ ఏమేరకు జరగాలో ఎమ్మెల్యే గంటాకు వివరిస్తున్న అధికారులు

భీమునిపట్నం: భీమిలి మెయిన్ రోడ్డు విస్తరణపై శుక్రవారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆరా తీశారు. ఇక్కడి మెయిన్ రోడ్డును పరిశీలించారు. రోడ్డు ఇరుకుగా ఉండడం వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ రోడ్డును సుమారు 60 అడుగుల మేరకు విస్తరించడానికి పరిశీలన చేశారు. విస్తరణ ఏమేరకు చేయాలి, కలిగే ప్రయోజనాలను ఎమ్మెల్యేకు అధికారులు వివరించారు. గంటా మాట్లాడుతూ విస్తరణ వల్ల ప్రైవేటు షాపులు, ఆస్తులు ఏమేరకు తొలగించాలి, వాటికి నష్ట పరిహారాలు, తదితర విషయాలపై అంచనాలు రూపొందించాలని సూచించారు. అదే విధంగా ఇక్కడ కొత్తగా నిర్మిస్తున్న మార్కెట్‌కు సంబంధించి ముందు వైపు ఉన్న షాపుల పైన రేకులు అమర్చాలని నిర్ణయించగా.. వాటి స్థానంలో శ్లాబ్‌లు వేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, ఏసీపీ శ్రీనివాస్, పబ్లిక్ వర్క్స్ ఏఈ సమన్ పాల్గొన్నారు.

దుర్గాలమ్మకు విశేష పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. నిత్య పూజా కార్యక్రమాలతో ప్రారంభించి ప్రత్యేక కుంకుమార్చనలు, పంచామృత సుగంధ అభిషేకాలు అర్చకులు పట్నాల హరిప్రసాద్ శర్మ, మూర్తి శర్మలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మధురవాడకు చెందిన శ్రీధర్, గీత దంపతుల సహాయ సహకారాలతో పులిహోర, ఇతర ప్రసాదాలు అమ్మవారికి నివేదించి భక్తులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లా సూరిబాబు, నాగోతి తాతారావు, కార్యవర్గ సభ్యులు పీవీపీ అప్పారావు, పిల్లా వెంకటరమణ, పోతిన పైడిరాజు, దుర్గాసి సోంబాబు, భోగవిల్లి రాము, పిల్లా రమణ, పిల్లా మోహన్ శివ కృష్ణ, పీస రాము తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతకు చెక్ పెడదాం



గంభీరం వెల్‌నెస్ సెంటర్‌లో రక్తహీన మాత్రలను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

తగరపువలస: ఎనీమియా ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం శుక్రవారం ఆనందపురం మండలంలో పర్యటించింది. బోయిపాలెం, చందక, గంభీరం పంచాయతీల్లో వైద్యశాఖ, ఐసీడీఎస్ శాఖల పనితీరును పరిశీలించిన తరువాత బోయిపాలెం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతూ రక్తహీనతను నివారించే మాత్రలు ప్రతి శుక్రవారం ఇస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. హిమోగ్లోబిన్ పరీక్షల రికార్డులను పరిశీలించారు. గంభీరం, చందకలలో ఉన్న హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లను పరిశీలించి గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికల్లో రక్తహీనతకు తీసుకుంటున్న చర్యలు తెలుసుకున్నారు. ఈ బృందంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ కేంద్ర కార్యాలయ అధికారి డాక్టర్ ఎస్.పూజిత, ఎనీమియా ముక్తి భారత్ జిల్లా ప్రోగ్రాం అధికారి సమత, డాక్టర్ హీనా దీక్షిత్, ఆనందపురం పీహెచ్‌సీ వైద్యాధికారి గంగునాయుడు, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్స్ అధికారి మనోరమ, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఐసీడీఎస్ భీమిలి పీవో మామిడి శ్రీదేవి, పర్యవేక్షకురాలు రత్నం, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్, పార్వతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాఖ న్యాయ కళాశాలలో ఫీ'జులుం'

తగరపువలస: భీమిలి మండలం శింగనబంధలోని విశాఖ లా కళాశాలలో అన్యాయంగా అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో బాధిత విద్యార్థులు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా నగరంలోని మర్రిపాలెం, మధురలక్ష్మీనగర్‌కు చెందిన విద్యార్థి పిల్లా గీత మాట్లాడుతూ 2021-24 మూడేళ్ల న్యాయ విద్యకు ఏడాదికి రూ.20 వేలు వంతున మొత్తం రూ.60వేలు చెల్లించాల్సి ఉండగా.. కళాశాల యాజమాన్యం తన నుంచి రూ.86 వేలు వసూలు చేసిందని ఆరోపించారు. గురువారం టీసీ, మార్కుల లిస్ట్, స్టడీ సర్టిఫికెట్ల కోసం కళాశాలకు వెళ్తే ఇంకా రూ.11వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. రూ.3వేలు ఇస్తే వైవాకు హాజరుకాకపోయినా పాస్ చేస్తారన్నారు. సెమిస్టర్ పరీక్ష ఫీజు రూ.1255 ఉంటే కళాశాల యాజమాన్యం రూ.2500 వసూలు చేస్తుందన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఉపాధ్యాయినికి ఘన వీడ్కోలు



ఉపాధ్యాయిని సుజాతకుమారి దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

భీమునిపట్నం: స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయిని సత్యాల సుజాతకుమారి ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా శుక్రవారం ఆమెకు సత్కార వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిహెచ్.సింహాచలం మాట్లాడుతూ సుజాతకుమారి ఎంతో బాధ్యతగా విధులు నిర్వర్తించి ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. ఆమెను ఇతర ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా సుజాతకుమారి దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం సిహెచ్.సింహాచలం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఏబీ చర్చి ఫాదర్ లివింగ్‌స్టన్, పెద్దలు మైలిపల్లి లక్ష్మణరావు, కె.ముత్యాలరావు, దత్తి ఈశ్వరరావు, అవనాపు అప్పలనాయుడు, ఉపాధ్యాయులు నయిం అన్సారి, అల్లాడి శ్రీనివాసరావు, వెంకటరావు, రామకృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు

పద్మనాభం: ఎస్‌వోఎస్‌ను స్ఫూర్తిగా తీసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను అందరూ ప్రోత్సహించాలని కోరాడ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని కోరాడలో ప్రాథమిక పాఠశాల, మజ్జిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 85 మంది విద్యార్థులకు ఎస్‌వోఎస్ సమకూర్చిన నోట్ పుస్తకాలను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఎస్‌వోఎస్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. విద్యార్థులు విద్యావంతులై గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఎంఈవో పి.రమణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వోఎస్ కుటుంబ బలోపేత ప్రాజెక్టు ఇన్‌చార్జి కె.దుర్గరాజు పాల్గొన్నారు.

యునిసెఫ్ సమ్మిట్‌కు ఓక్రిడ్జ్ విద్యార్థుల హాజరు



హ్యూస్టన్ సమ్మిట్‌లో పాల్గొన్న ఓక్రిడ్జ్ విద్యార్థులు

తగరపువలస: ఇటీవల హ్యూస్టన్‌లో జరిగిన యునిసెఫ్ సమ్మిట్ ఎస్‌ఏఈలో భీమిలి మండలం శింగనబంధ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారు. ప్రపంచ వ్యాప్తంగా ముఖ్యమైన సమస్యలు చర్చించి పరిష్కారాలు సాధించడానికి జరిగిన ఈ సమ్మిట్‌లో ఓక్రిడ్జ్‌కు చెందిన ఎస్.సూర్యతేజ్, వి.అన్యా, బి.సృజన్ పాల్గొన్నారు. సమ్మిట్‌లో అద్భుతమైన నాయకత్వం, పట్టుదల ప్రదర్శించారని స్కూల్ యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. విద్యుతో మొదలుకుని పర్యావరణ మార్పుల వరకు వివిధ అంశాలపై విద్యార్థులు లోతైన చర్చల్లో పాల్గొన్నారని పేర్కొంది. ఈ సమ్మిట్‌లో నార్త్ ఆంగ్లియాకు చెందిన 120 కంటే ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆరు రోజుల పాటు జరిగిన సమ్మిట్‌లో పాల్గొన్న విద్యార్థులను ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల అభినందించారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ఏపీటీఎఫ్ సమావేశం



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్

తగరపువలస: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ భీమిలి మండల శాఖ కార్యవర్గం శుక్రవారం ఉపాధ్యాయుల సమస్యలపై భీమిలిలో సమావేశమైంది. మండల శాఖ అధ్యక్షుడు కె.సన్యాసినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు జిల్లా అధ్యక్షుడు సిహెచ్.కరుణాకర్, ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా ప్రభుత్వ విద్యారంగానికి ఇబ్బంది కలిగించే జీవో నంబర్ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే తల్లికి వందనం పథకం వర్తింపజేయాలన్నారు. మాతృభాషకు ప్రాధాన్యమిస్తూ ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలను సమాంతరంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ.మహాలక్ష్మినాయుడు, జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శ సభ్యుడు డి.దాలయ్యబాబు ఇతర మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కాజ్‌వే

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- కొత్తది నిర్మించాలని స్థానికుల విజ్ఞప్తి



పాట్నూరులో శిథిలమైన లో లెవెల్ కాజ్‌వే

పద్మనాభం: మండలంలోని పాట్నూరులో శ్రీకృష్ణ దేవరాయల విజయ స్థూపం సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న లోలెవెల్ కాజ్‌వే శిథిలావస్థలో కొట్టుమిట్టాడుతోంది. గెడ్డపై రోడ్డుకు అనుసంధానంగా దశాబ్దాల కిందట నిర్మించిన ఈ మార్గంలో గోతులు ఏర్పడ్డాయి. ద్విచక్ర వాహన చోదకులు, ప్రయాణికులు ఈ దారిలో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసేటప్పుడు గెడ్డలో నుంచి వచ్చే వర్షపు నీరు కాజ్‌వేపై పొంగి ప్రవహిస్తోంది. దీని మీద నుంచే గ్రామస్తులు మండల కేంద్రమైన పద్మనాభం, విశాఖపట్నం, సింహాచలం వంటి ప్రాంతాలకు వెళ్తారు. వర్షాల సమయంలో కాజ్‌వే మీద నుంచి వర్షపు నీరు పొంగి ప్రవహించడం వల్ల గ్రామ ప్రజలు గ్రామం నుంచి పైకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. కాజ్‌వేకు ఇరుకు పక్కల ఉన్న రక్షక దిమ్మలు దెబ్బతిన్నాయి. వాహన చోదకులు ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా వాహనాలు గొడ్డలోకి పల్టీ కొట్టే ప్రమాదముంది. పాలకులు, అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న కాజ్‌వే స్థానంలో కొత్తది నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



మల్లెపూలు, గులాబీల అలంకరణలో అమ్మవారు



క్షీరాభిషేక సేవలో శ్రీ కనకమహాలక్ష్మి

అల్లిపురం : బురుజుపేటలో వెలసిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో ఉభయదాతలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారిని మల్లెలతో అభిషేకించారు. ప్రతి శుక్రవారం జరిగే ఈ పూజలో పాల్గొనే వారు రూ.500 చెల్లించిన యెడల ఈ పూజకు దంపతులను లేక ఇద్దరిని అనుమతిస్తామని ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వి.రాంబాబు తెలిపారు. ఆసక్తి గల వారు 0891-2566514, 8985515989 నంబర్లు, వాట్సాప్ ద్వారా సేవా టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన.. కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

కేజీహెచ్‌కు చెడ్డపేరు తెస్తే ఉపేక్షించేది లేదు

సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్



మహారాణిపేట : కేజీహెచ్‌లో కొంత మంది నర్సుల వల్ల ఆస్పత్రికి చెడ్డ పేరు వస్తోందని సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ అన్నారు. శుక్రవారం కేజీహెచ్‌లోని ఎథిక్స్ గ్యాలరీలో నర్సులను ఉద్దేశించి మాట్లాడారు. కొంత మంది నర్సులు ఆకాశరామన్న ఉత్తరాలు రాసి వ్యతిరేకంగా పని చేస్తున్నారన్నారు. ఇక్కడ 700 మంది నర్సులు పని చేస్తున్నారని.. అందరినీ ఏం అనలేమన్నారు. ఇటీవల ఆస్పత్రిలో నెలకొన్న పరిస్థితులను ఆయన ప్రస్తావించారు. తనకు ఎవరి మీద వ్యతిరేకత లేదన్నారు. అయితే కేజీహెచ్‌కు చెడ్డ పేరు తీసుకొస్తే మాత్రం ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇప్పటి వరకు జరిగిన దాని కోసం తాను ప్రస్తావించడం లేదన్నారు. రేపటి నుంచి నర్సులు గాని, ఇతర స్టాఫ్ గాని ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. నియమ నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలన్నారు.

వెల్ఫేర్ బోర్డు పథకాలు కొనసాగించాలి

సీఐటీయూ డిమాండ్

అల్లిపురం : భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం భవన నిర్మాణ కార్మికుల జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు కరోనా సమయంలో పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడినప్పుడు వెల్ఫేర్ బోర్డు ద్వారా ఎటువంటి సాయం అందలేదన్నారు. వెల్ఫేర్ బోర్డులో వున్న సొమ్మును కార్మికుల సంక్షేమానికి ఖర్చు పెట్టలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.అనసూయ, పూర్వ ప్రధాన కార్యదర్శి జి.పోలేశ్వరరావు, కె.నర్సింగరావు, రమణ, లక్ష్మణ, రాజు, చంద్రరావు, సూరప్పడు అన్ని జోన్ల కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశాఖ జిల్లా అధ్యక్షురాలు అనసూయ

విద్యుత్ షాక్‌తో హెల్పర్ మృతి

గోపాలపట్నం: గోపాలపట్నంలోని ఓ ఆస్పత్రి వద్ద విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తున్న సమయంలో.. కరెంట్ షాక్‌కు గురై హెల్పర్ సిరపురపు శంకరరావు(51) మృతి చెందాడు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలివీ.. సింహాచలం సాయినగర్‌కు చెందిన సిరపురపు శంకరరావు లైన్‌మన్ వద్ద హెల్పర్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి ఆస్పత్రి వద్ద విద్యుత్ సమస్య ఉండడంతో.. స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తున్నాడు. ఆ సమయంలో విద్యుత్ షాక్‌కు గురై స్తంభంపై నుంచి కిందకు పడిపోవడంతో తీవ్రంగా దెబ్బలు తగిలాయి. వెంటనే అతన్ని బెహరా ఆస్పత్రిలో చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. శుక్రవారం తెల్లవారుజామున ఆయన మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. వివరాలిలా.. గురువారం రాత్రి విశాఖ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం 2లో గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు గవర్నమెంట్ రైల్వే పోలీసులకు సమాచారం తెలసింది. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్. ధనుంజయనాయుడు ఆదేశాలతో ఎస్ఐ వి.బాలాజీరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవని, వయసు సుమారు 50ఎ ఏళ్లు, ఎత్తు సుమారు 5.5 అడుగులు, చామనచాయ రంగులో ఉంటాడని, నీలం రంగు టీ షర్ట్, నలుపు రంగు నిక్కర్ ధరించి ఉన్నట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు. మృతుడు ఆచూకీ తెలిసిన వారు విశాఖ రైల్వే స్టేషన్‌లోని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా గానీ లేదా 96661 22722, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని ఎస్ఐ బాలాజీరావు కోరారు.